నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I హైదరాబాద్, గురువారం 29 ఆగస్టు 2024 VIKARABAD


## అంకితభావంతో పని చేయండి

### మోమిన్‌పేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, ఆగస్టు 28 : జిల్లాలోని మోమిన్‌పేట పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ నారాయణరెడ్డి బుధవారం సందర్శించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. పీఎస్ ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధుల్లో అంకిత భావంతో పని చేయాలని పోలీసులకు సూచించారు. ప్రజలకు సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించాలన్నారు. ఎస్పీతో పాటు డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ ఆంజనేయులు, ఎస్ఐ అరవింద్, పోలీస్ ఇబ్బంది ఉన్నారు.


ఎమ్మెల్యే కారుపై కోడిగుడ్లతో దాడి చేసిన కాంగ్రెస్ శ్రేణులు

## సిబ్బంది నిర్లక్ష్యం..
# రోగులకు ప్రాణసంకటం

- చేవెళ్ల ప్రభుత్వ దవాఖాన ఫార్మసీలో వింత పరిస్థితి
- డాక్టర్ రాసిన మందులు కాకుండా.. ఇతర మెడిసిన్ అందజేత
- ఇదేంటని ప్రశ్నిస్తే దురుసు ప్రవర్తన
- అధికారులు చర్యలు తీసుకోవాలని బాధితుల వేడుకోలు

చేవెళ్ల రూరల్/చేవెళ్లటౌన్, ఆగస్టు 28 : చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం.. రోగులకు ప్రాణసంకటంగా మారుతున్నది. దీంతో వైద్యం కోసం వచ్చే పేదలకు ఇబ్బందులు తప్పడం లేదు. బుధవారం మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన పదేండ్ల మహేశ్వరి అనే చిన్నారిని ఆమె తల్లి చేవెళ్ల ప్రభుత్వ దవాఖానకు తీసుకొచ్చింది. వైద్యుడికి చూపించగా.. పలు మందులను రాశాడు. ఆ ప్రిస్క్రిప్షన్‌ను తీసుకుని నేరుగా ఫార్మసీ వద్దకు వెళ్లగా అక్కడి సిబ్బంది.. డాక్టర్ రాసిన మందులు కాకుండా వేరే మందులను ఆమెకు ఇచ్చారు. ఇదే విధంగా పలువురు రోగులకు కూడా ఆ సిబ్బంది వేరే మెడిసిన్ ఇచ్చారని.. వైద్యం వికటించి ప్రాణాలకు ఆపాయం జరిగితే ఎవరూ బాధ్యత వహిస్తారని రోగులు, వారి సహాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత వైద్యులు అందుబాటులో లేనప్పుడు ఏమైనా క్రిటికల్ కేసులొస్తే ట్రైనీ వైద్యులే వైద్యం అందిస్తున్నారని పేర్కొంటున్నారు. ఆస్పత్రిలో వైద్యులందరూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.

### రెస్ట్‌లో ఫార్మాసిస్టులు.. డ్యూటీలో 104 ఉద్యోగి..

డ్యూటీ చేయాల్సిన ఫార్మాసిస్టులు విశ్రాంతి తీసుకుంటున్నారు. ఫార్మసీ గ్రేడ్-1 ఉద్యోగి అయిన ముక్తార్ హైమద్, ఫార్మసీ గ్రేడ్-2 ఉద్యోగిణి అరుణ విధులు నిర్వహించకుండా 104 ఉద్యోగితో మందులు ఇప్పిస్తున్నారు. ఫార్మసీకి సంబంధం లేని వారు చీటీలు చూస్తూ ఇచ్చిన మందులు వేరేవిగా ఉండడంతో రోగులు తిరిగి వచ్చి ఇదేంటని ప్రశ్నిస్తే పొంతన లేని సమాధానాలిస్తూ దబాయిస్తున్నారు.

### విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలే..

ఈ విషయమై చేవెళ్ల ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ రాజేంద్రప్రసాద్‌ను వివరణ కోరగా.. విధుల్లో నిర్లక్ష్యం చేసే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందేలా ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేసేలా చూస్తామని పేర్కొన్నారు.


చేవెళ్ల ప్రభుత్వ దవాఖాన


రావద్దంటూ ఎమ్మెల్యే కాలె యాదయ్య వాహనాన్ని అడ్డుకుంటున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

# కాంగ్రెస్‌లో కుమ్ములాట..

## షాబాద్‌లో ఎమ్మెల్యే కాలె యాదయ్యకు నిరసన సెగ


గో బ్యాక్ ఎమ్మెల్యే...

- పదేండ్లుగా కాంగ్రెస్ పార్టీ కోసం ఎంతో కష్టపడ్డాం..
- ఎమ్మెల్యేను రానివ్వమంటూ కోడిగుడ్లు, టమాటాలు, వాటర్ బాటిళ్లతో కారుపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల దాడి
- ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు
- గంటకుపైగా మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన
- పోలీసుల భద్రత మధ్య ఆఫీసులోకెళ్లి.. చెక్కులు పంపిణీ చేసి వెళ్లిపోయిన ఎమ్మెల్యే

**కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని అడ్డుకున్న సొంత పార్టీ నాయకులు**


షాబాద్, ఆగస్టు 28 : మండల కాంగ్రెస్ పార్టీలో కుమ్ములాటలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి ఈ మధ్య కాలంలో కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే కాలె యాదయ్యకు సొంత పార్టీ నాయకుల నుంచే నిరసన సెగ తగిలింది. గత పదేండ్లుగా కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలను పట్టించుకోకుండా ఒక్క వర్గానికే ప్రాధాన్యం ఇస్తున్నారని మండిపడ్డారు. బుధవారం కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేసేందుకు ఎమ్మెల్యే కాలె యాదయ్య షాబాద్ మండలానికి రాగా.. సొంత పార్టీకి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే వాహనాన్ని అడ్డుకున్నారు. గో బ్యాక్ ఎమ్మెల్యే.. ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ కోడిగుడ్లు, టమాటలు, వాటర్ బాటిళ్లతో ఆయన కారుపై దాడి చేశారు. పదేండ్లుగా కాంగ్రెస్‌ను బతికించు కున్నా మమ్మల్ని కాదని.. కొంత మందిని మాత్రమే వెంట వేసుకుని తిరుగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాకు సమాధానం చెప్పే వరకు ఎమ్మెల్యేను మండల పరిషత్ కార్యాలయంలోకి వెళ్లనిచ్చేది లేదని వాహనానికి అడ్డంగా పడుకున్నారు. ఇదే సమయంలో అక్కడికొచ్చిన పార్టీ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్‌పై కొందరు కార్యకర్తలు దాడికి దిగారు. దీంతో అతడిని పోలీసులు అక్కడి నుంచి పంపించారు. సుమారు గంటకు పైగా కార్యకర్తలు నిరసన తెలిపినా ఎమ్మెల్యే మాత్రం కారు దిగి రాలేదు. ఎట్టకేలకు షాబాద్ సీఐ కాంతారెడ్డి నిరసనకారుల్ని సముదాయించి మీతో ఆయన్ను మాట్లాడిస్తానని వారిని అక్కడి నుంచి పంపించారు. చివరకు పటిష్ట భద్రత మధ్య ఎంపీడీవో కార్యాలయంలోకెళ్లిన ఎమ్మెల్యే లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసి వెళ్లిపోయారు. కాగా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్‌పై చేవెళ్ల నుంచి పోటీ చేసి ఓడిపోయిన భీంభరత్, ఆయన వర్గీయులు, చాలామంది పార్టీ సీనియర్లను ఎమ్మెల్యే పట్టించుకోకపోవడం.. పదేండ్ల కిందట కాంగ్రెస్ టికెట్‌పై గెలిచి బీఆర్ఎస్‌లో చేరిన ఎమ్మెల్యే యాదయ్య అక్కడ రాజభోగాలు అనుభవించి, మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పార్టీలోకి వచ్చాడనే ఆగ్రహంతోనే కార్యకర్తలు ఈ దాడికి దిగినట్లు సమాచారం. ఎమ్మెల్యే యాదయ్య కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచే షాబాద్‌లో ఆ పార్టీ నాయకులు రెండు వర్గాలుగా వీడిపోయారు. ఇరువురి మధ్య కుమ్ములాటలు జరుగుతున్నాయి..!


షాబాద్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

# రేషన్ కార్డున్నా..మాఫీ సున్నా !

**పంట రుణాలు మాఫీ కాని అన్నదాతలు తీవ్ర మదనపడుతున్నారు. అన్ని అర్హతలున్నా.. మాకు ఎందుకు మాఫీ వర్తించలేదని వ్యవసాయాధికారులను ప్రశ్నిస్తున్నారు. మండలంలోని నస్కల్ గ్రామంలో సుమారు వెయ్యి మందికి పైగానే రైతులుండగా.. ఆ ఊరిలో 45 శాతం మందికే రుణమాఫీ వర్తించింది. బ్యాంకుల్లో రుణాలు తీసుకుని సక్రమంగా రెన్యువల్ చేస్తున్నామని.. రేషన్ కార్డు ఉన్నా మావి ఎందుకు మాఫీ కాలేదని మిగిలిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.**

- నస్కల్‌లో 45 శాతం మందికే రుణమాఫీ
- అర్హత ఉన్నా.. వర్తించని మాఫీ
- కొర్రీలు, షరతులతో రైతులను మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఇదేనా ప్రజాపాలన అని మండిపాటు
- రుణమాఫీ కాని రైతుల ఫ్యామిలీ గ్రూపింగ్ సర్వే



పరిగి, ఆగస్టు 28 : పంట రుణాలు మాఫీ అవుతాయని ఎన్నో ఆశలు పెట్టుకున్న అన్నదాతల ఆశలు అడియాసలయ్యాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీ పథకం రైతులకు అందని ద్రాక్షలా మారింది. మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ. రెండు లక్షల్లోపు పంట రుణాలను ఎలాంటి షరతుల్లేకుండా మాఫీ చేస్తామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి.. అధికారంలోకి రాగానే మాట తప్పాడు. అనేక కొర్రీలు, నిబంధనల పేరుతో అన్నదాతలను ఆగం చేస్తున్నా డు. డిసెంబర్ 9వ తేదీ పోయి 8 నెలలు దాటినా ఇప్పటికీ రుణమాఫీ పూర్తిస్థాయిలో జరుగలేదు. ఆగస్టు 15లోపు మూడు విడతలుగా రుణమాఫీ చేసిన ప్రభుత్వం.. అన్ని అర్హతలున్నా తమ రుణాలను ఎందుకు మాఫీ చేయలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకమీదటైనా తమ రుణాలు మాఫీ అవుతాయో లేదోనని మదనపడుతున్నారు. అందరికీ రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం తర్వాత అనేక కొర్రీలు పెడుతూ రుణమాఫీని సాగదీయడం సరికాదని పేర్కొంటున్నారు. ఇదేనా ప్రజాపాలన అని పలువురు మండిపడుతున్నారు. మండలంలోని నస్కల్ గ్రామంలో సుమారు వెయ్యి మందికి పైగా అన్నదాతలున్నారు. వారిలో అత్యధికంగా వాణిజ్య పంటలను సాగు చేస్తున్నారు. కొన్నేండ్లుగా కొత్తిమీర సాగుకు ఈ గ్రామం కేరాఫ్ అడ్రస్‌గా నిలిచింది. ఇక్కడ సాగు చేసిన కొత్తిమీరను రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. కాగా రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం పరిగి పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్‌లో పంట రుణాలు పొందారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీతో రూ.2 లక్షల వరకు రుణమాఫీ అవుతుందని రైతాంగం ఆశించింది. కానీ నస్కల్ గ్రామానికి చెందిన రైతులకు మొదటి విడతలో 229 మందికి , రెండోవిడతలో 176 మందికి రుణమాఫీ జరిగింది. ఆగస్టు 15న ప్రకటించిన మూ డోవిడతలో బ్యాంకుల వారీగా రైతుల వివరాలను ఇవ్వడంతో ఎంతమంది రైతులకు మాఫీ జరిగిందన్న విషయాన్ని వ్యవసాయాధికారులు సైతం చెప్పలేకపోతున్నారు. మూడు విడతల్లో గ్రామంలో కలిపి 45శాతం వరకే రుణమాఫీ జరిగింది. రుణమాఫీ కాని బాధితులు రేషన్‌కార్డుతోపాటు అన్ని అర్హతలున్నా తమ రుణాలు మాఫీ కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకులో రుణాలు తీసుకుని సక్రమంగా రెన్యువల్ చేస్తున్నా రుణమాఫీ ఎందుకు వర్తించలేదని అధికారులను ప్రశ్నిస్తున్నారు.

### ఫ్యామిలీ గ్రూపింగ్ సర్వేతోనైనా మాఫీ జరిగేనా..

రుణమాఫీ జరుగని రైతులకు, రేషన్ కార్డుల్లేని వారి కుటుంబ సర్వేను వ్యవసాయాధికారులు చేపట్టారు. బుధవారం నస్కల్ గ్రామంలోని రైతువేదికలో ఫ్యామిలీ గ్రూ పింగ్ సర్వే నిర్వహించారు. ఇందులో రుణమాఫీ జరుగని, రేషన్‌కార్డు లేని రైతుల వివరాలను రుణమాఫీ యాప్‌లో అప్‌లోడ్ చేయడంతోపాటు వ్యవసాయాధికారి స్వయంగా సంబంధిత రుణమాఫీ జరుగని రైతు కుటుంబంతో సెల్ఫీ తీసుకొని ఫొ టోను సైతం ఆ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. ఫ్యామిలీ గ్రూపింగ్ సర్వేతోనైనా తమకు రుణమాఫీ జరుగుతుందా..? అనే అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. రుణమాఫీ జరుగకపోవడానికి పలు కారణాలున్నాయని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. రైతులకు సంబంధించిన ఆధార్‌కార్డులో ఒకలా, బ్యాంకు ఖాతాలో పేరు మరొలా ఉండడం, ఒక ఆధార్‌కార్డు అనేక బ్యాంకు ఖాతాలకు అనుసంధానం చేసి ఉండడం వంటి కారణాలతో రుణమాఫీ కాలేదని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ఎనిమిదేండ్లపాటు బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు డబ్బులు సంబంధిత ఖాతాల్లో జమ కాగా.. నేటి ప్రభుత్వం రుణమాఫీ చేయకుండా కొత్త సాకులు చెబుతున్నదని రైతులు వాపోయారు. కొర్రీలన్నీ పక్కన పెట్టి బేషరతుగా రైతులందరికీ రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.


వ్యవసాయ కార్యాలయానికి వచ్చిన రుణమాఫీ బాధితులు


రుణమాఫీ జరగని రైతు కుటుంబంతో సెల్ఫీ తీసుకుంటున్న మండల వ్యవసాయాధికారిణి రజిత

### అర్హత ఉన్నా మాఫీ కాలేదు..



రేషన్ కార్డు ఉన్నప్పటికీ రుణమాఫీ కాలేదు. కేసీఆర్ హయాంలో రూ. లక్ష వరకు రుణమాఫీ జరిగింది. నా పేరిట 7 ఎకరాల భూమి ఉండగా పరిగిలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్‌లో రూ.1.50 లక్షల రుణం తీసుకున్నా. ప్రభుత్వం మూడు విడతల్లో రుణమాఫీ చేసినా నాకు మాత్రం వర్తించలేదు. వ్యవసాయాధికారులను అడిగితే ఈ నెలాఖరు వరకు కావొచ్చని చెబుతున్నారు. ఇచ్చిన మాట ప్రకారం రేవంత్ ప్రభుత్వం ఎలాంటి షరతుల్లేకుండా రూ.2లక్షల వరకు రుణాలను మాఫీ చేయాలి.

–గొల్ల మల్లయ్య, నస్కల్, పరిగి మండలం

### అందరి రుణాలను మాఫీ చేయాలి



నాకు 4.20 ఎకరాల భూమి ఉంది. పరిగిలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్‌లో రూ.2 లక్షల క్రాప్ లోన్ తీసుకున్నా. కాంగ్రెస్ ప్రభుత్వం అధి కారంలోకి రాగానే ఆ రుణాలు మాఫీ అవుతాయని తెలిసి చాలా సంతోషించా. అయితే ప్రభుత్వం మూడు విడతలుగా మాఫీ చేసినా.. నా రుణాలు మాత్రం మాఫీ కాలేదు. రేషన్‌కార్డు కూడా ఉన్నది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులందరి రుణాలను మాఫీ చేయాలి.

– వడ్ల బక్కన్న, నస్కల్, పరిగి


కడ్తాల్ మండలంలోని మైసిగండి గ్రామంలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

# చల్లంగ చూడు అమ్మోరు తల్లీ..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని పలు గ్రామాల్లో బుధవారం బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మహిళలు బోనమెత్తుకుని భాజాభజంత్రీలతో ఊరేగింపుగా ఆలయాలకు తరలివెళ్లి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. చల్లంగ చూడు అమ్మోరు తల్లీ.. ఈ ఏడాది పంటలు బాగా పండేలా ఆశీర్వదించమ్మా.. అంటూ భక్తులు వేడుకున్నారు. శివసత్తుల పూనకాలు, కళాకారుల నృత్యాలు, పోతరాజుల విన్యాసాలు చూపరులను అలరింపజేశాయి.




యాచారం మండలం కుర్మిద్ద గ్రామంలో బోనాల ఊరేగింపు